పాదచారులు నడిచేదెలా?

- నగరంలోని రైల్వే ఓవర్‌బ్రిడ్జిపై ధ్వంసమైన ఫుట్‌పాత్
- ఏళ్లు గడుస్తున్నా బాగుచేయని యంత్రాంగం



రైల్వే ఓవర్ బ్రిడ్జిపై అధ్వానంగా మారిన ఫుట్‌పాత్



రోడ్డుపై నుంచే నడుచుకుంటూ వెళ్తున్న పాదచారులు

నిజామాబాద్ సిటీ: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో రెండు ప్రాంతాలను కలిపే రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఫుట్‌పాత్ చెడిపోవటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి పైనుంచి పాదాచారులు రాకపోకలు సాగించేందుకు నిర్మాణ సమయంలో ఫుట్‌పాత్ ఏర్పాటు చేశారు. కానీ చెడిపోయి ఏళ్లు గడుస్తున్నా పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

రోడ్డు పైనుంచే నడక..

లలితామహల్ థియేటర్ ప్రాంతంలో రైల్వేగేట్ మీదుగా దుబ్బా, నాందేవ్‌వాడ, హమల్‌వాడీ ప్రాంతాల ప్రజలు, చుట్టు పక్కల గ్రామాలు ఖానాపూర్, కాలూర్ గ్రామాలకు చెందిన వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాగా పెరిగిన రైళ్లతో తరుచుగా గేట్ పడుతుండటంతో సుమారు ఇరవై ఏళ్ల క్రితం నాటి మంత్రి డి శ్రీనివాస్ నగరంలోని పశ్చిమ, దక్షిణ భాగాలను కలుపుతూ రైల్వేట్రాక్‌పై ఓవర్ బ్రిడ్జి నిర్మించారు. అలాగే బ్రిడ్జిపై పాదచారులు నడిచేందుకు ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌లను ఇరువైపులా నిర్మించారు. ఇది ప్రస్తుతం అధ్వానంగా మారడంతో పాదచారులు రోడ్డు పైనుంచే వాహనాల మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఈ మధ్య కొన్ని ఆర్టీసీ బస్సులు, మహారాష్ట్రకు చెందిన బస్సులు ఈ బ్రిడ్జిపై నుంచి ప్రయాణిస్తుండటంతో బ్రిడ్జి మరింత రద్దీగా మారింది. ఓసారి బ్రిడ్జికి కొత్తహంగులు తీర్చిదిద్దినా ఫుట్‌పాత్ పరిస్థితి మారలేదు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌లను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



నగరంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఫుట్‌పాత్ పూర్తిగా ధ్వంసం అయింది. దీంతో పాదాచారులు రోడ్డుపై నుంచే వెళ్తుండటంతో వాహనాలు ఢీకొనే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి, బ్రిడ్జిపై ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టాలి.

– గోవింద్ సింగ్, నాందేవ్‌వాడ

అధికారులు పట్టించుకోవాలి..



రెండు ప్రాంతాలను కలిపే రైల్వే ఓవర్ బ్రిడ్జిపైగల ఫుట్‌పాత్‌లు చెడిపోయి ఏళ్లు గడుస్తున్నాయి. దీనిని బాగుచేయాలన్న ఆలోచన ఇటు ప్రజాప్రతినిధులకు, అధికారులకు రాకపోవటం శోచనీయం, ఇప్పటికైనా అధికారులు, పాలకులు పట్టించుకోని ఫుట్‌పాత్‌లను బాగుచేయించాలి.

– జయకృష్ణ, దేవిరోడ్డు

క్లుప్తంగా

సీఎం దిష్టిబొమ్మ దహనం



నిజామాబాద్అర్బన్: నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్ మాట్లాడుతూ.. ఎంపీ టికెట్లలో రాష్ట్రంలో మాదిగలకు కాంగ్రెస్ పార్టీ ఒక్క టికెట్ కూడా కేటాయించకపోవడంతో నిరసిస్తూ, ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మాదిగలకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించాలన్నారు. నాయకులు ప్రవీణ్, పద్మ, సతీష్, జీవన్, మోహన్, రవి, యమున పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మోపాల్(నిజామాబాద్‌రూరల్): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి, మద్దతు ధరను సద్వినియోగం చేసుకోవాలని బోర్గాం(పి) సొసైటీ సీఈవో కృష్ణ సూచించారు. నగర శివారులోని బోర్గాం(పి), తాడెం గ్రామాల్లో ఆదివారం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. సీఈవో మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. వీడీసీ ప్రతినిధులు మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది నర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్ ఎంపీపీ లతా కన్నీరాంతోపాటు మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పలువురు నాయకులు ఆదివారం బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ముప్ప గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, కెతావత్ యాదగిరి, సాయిరెడ్డి, రమేష్, రాములు, విద్యాసాగర్, శ్రావణ్‌కుమార్, ప్రకాశ్ నాయక్, అనిల్‌రెడ్డి, పోశెట్టి, ప్రేమ్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన కరువు భత్యం అమలు చేయాలి



డిచ్‌పల్లి: ఇటీవల బీడీకార్మికులకు పెంచిన కరువు భత్యం (వీడీఏ) రూ.11.30 పైసలు వెంటనే అమలు చేయాలని తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులు పోరాడి సాధించుకున్న వీడీఏను ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని బీడీ కంపెనీ యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీడీ కార్మికులు స్వరూప, వసంత, నాగవేణి, లక్ష్మి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్‌లో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జేసీఐ ఇందూర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పూర్వ జోన్ ఉపాధ్యక్షుడు విజయానంద్ 45వసారి రక్తదానం చేశారు. జేసీఐ ప్రతినిధులు మనోజ్ కుమార్, శ్రీధర్, జైపాల్, నరేంద్ర స్వామి, అశోక్, భూపతి, నాగేందర్ రక్తదానం చేశారు. నయన్, నిపున్, మనోజ్ కుమార్ పాల్గొన్నారు.

రుద్రూర్‌లో ఇఫ్తార్ విందు

రుద్రూర్: మండల కేంద్రంలో విండో మాజీ చైర్మన్ పత్తి రాము ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జడ్పీటీసీ నరోజి గంగారాం, విండో చైర్మన్ సంజీవరెడ్డి, తోట సంగయ్య, పత్తి రాము, కోడె శంకర్, మొద్దుల నర్సయ్య, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి చిత్రం..



రోడ్డు పక్కన చెత్తను తొలగించరు!

నగరంలోని దుబ్బ నుంచి బైపాస్‌కు వెళ్లే రోడ్డు పక్కన కొందరు మున్సిపల్ కార్మికులు చెత్తను సేకరించి డంపింగ్ చేస్తున్నారు. అలాగే నగరంలోని కొన్ని కొబ్బరిబొండాల దుకాణాల నిర్వాహకులు ఖాళీ బోండాలను రోడ్డు పక్కనే పారవేస్తున్నారు. దీంతో వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు పక్కన చెత్త వేయకుండ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

బీజేపీ గెలుపు కోసం కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

సిరికొండ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పార్టీ శ్రేణులు పని చేయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం సిరికొండ, ధర్పల్లి మండలాల బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను పార్టీ శ్రేణులు ఇంటింటికీ వివరించాలన్నారు. బీజేపీ మరోమారు పార్లమెంట్ ఎన్నికల్లో ఘన విజయం సాధించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, ప్రభారీ వెంకటరమణ, పార్లమెంట్ కన్వీనర్ గడ్డె భూమన్న, పద్మారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, నక్క రాజేశ్వర్, రంజిత్‌రెడ్డి, గోవింద్, సంజీవ్‌రెడ్డి, శ్రావణ్, నానాపాటేకర్, లింబాద్రి, చారి, శంకర్, రామస్వామి, తాళ్ల శ్రీనివాస్, సతీష్, రవి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్య వైశ్య గ్రాడ్యుయేట్స్‌కు అండగా ఉంటా

నిజామాబాద్ సిటీ: యువతలో ప్రతిభను వెలికితీస్తున్న ఆర్య వైశ్య గ్రాడ్యుయేట్ అసోసియేషన్‌కు తాను అండగా ఉంటానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఆర్యవైశ్య సంఘంలో ఆదివారం ఆర్య వైశ్య గ్రాడ్యుయేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దిక్సూచి 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దిక్సూచి పేరుతో యువత కోసం వారికి ఉపాధి అందించే లక్ష్యంతో ఆర్యవైశ్య గ్రాడ్యుయేట్ అసోసియేషన్ మంచి కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమన్నారు. సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్న సభ్యులను అభినందించారు. తన ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థుల చదువులకు ఎల్లప్పుడూ అండగా ఉంటున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు కుక్కుట్ల నవీన్‌కుమార్, సాయి కిరణ్, కాంచన్ ముప్కాల్కర్, నాగోల్ల లక్ష్మీ నారాయణ, ఇల్లందుల ప్రభాకర్, మఠం పవన్, పవన్ ముందడ, మరవర్ కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధన్‌పాల్.. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సమస్యల పరిష్కారానికి కృషి

నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న అన్ని సమస్యలపై దృష్టిపెట్టి, త్వరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. లలితనగర్ ఫేజ్ 2, శ్రీ లలితదేవి సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ ఉమామహేశ్వర గణేష్ మండలి షెడ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనను గాలికి వదిలి తెలంగాణను దోచుకున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించి అక్కున చేర్చుకున్న ఇందూర్ ప్రజలకు సేవ చేసి ఋణం తీర్చుకుంటానని అన్నారు. హిందూ ధర్మాన్ని రక్షించడంలో ప్రతి హిందువు ముందుకురావాలన్నారు. అనంతరం కాలనీవాసులు ఎమ్మెల్యేకు సమస్యలపై వినతి పత్రం అందజేసి, సన్మానించారు. రాజేందర్, దిలీప్ కుమార్, గిరీష్ పటేల్, రమణకుమార్, నాగోళ్ళ లక్ష్మి నారాయణ, మమతా ప్రభాకర్,మఠం పవన్, పవన్ ముందడ, కృష్ణ, శేఖర్, దీపక్ పాల్గొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ



నూతన పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బ్రాహ్మణ సంక్షేమ సంఘం ప్రతినిధులు

నిజామాబాద్ సిటీ: నగరంలోని బ్యాంక్‌కాలనీ తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆదివారం సంఘం జిల్లా అధ్యక్షుడు అధ్యక్షుడు కిరణ్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో శ్రీ క్రోధి నామ సంవత్సర నూతన పంచాంగంను ఆవిష్కరించారు. అనంతరం కిరణ్ దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. రాబోయే శ్రీ క్రోధి నామ సంవత్సరం ప్రజలందరికి సుఖ సంతోషాలను కలుగజేయాలనీ, గాయత్రీ మాత అనుగ్రహంతో రైతులు పాడిపంటలు బాగుండాలని ప్రార్థిస్తూ, ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. రచయిత, ఆధ్యాత్మికవేత్త వేలేటి గౌరీశంకర శర్మ, పంచాంగ కర్తలు బ్రహ్మశ్రీ యల్లాప్రగడ చంద్రశేఖర శర్మ, పాలెపు శ్యామసుందర శర్మ, సంఘ ప్రతినిధులు రొట్టె సురేష్ శర్మ, పుల్కల్ రమేష్, మేడిచర్ల శ్రీనాథ్. ప్రకాష్ కులకర్ణి, కరణం సౌమ్య భరద్వాజ్, శైలజ, వీణా, శంకర్ రావు, లక్ష్మి నారాయణ భరద్వాజ్, లక్ష్మణ్ వైరాగర్, కోస్లే చంద్రశేఖర్, మంచి కంటి శ్రీనివాస్ రావు, రామ్మోహన్ రావు, మల్లికార్జున్ రావు, గుండేరావు దేశ్ ముఖ్, వేణుగోపాల్, సంజీవ్ పండిట్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

భక్తిశ్రద్ధలతో సాయి పల్లకీసేవ



ధర్పల్లి: మండలంలోని దుబ్బాక గ్రామంలో ఆదివారం సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో పల్లకీసేవను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులగుండా సత్యసాయి పాటలు పాడుతూ, భజన కీర్తనలతో ఊరేగింపు చేశారు. సత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, కుసుమా, ఈశ్వర్, శంకర్, మంజుల, భాస్కర్, విట్టల్, శ్రీనివాస్, జ్యోతి పాల్గొన్నారు.

నిధులున్నా పనుల్లో జాప్యం

- ఇందల్వాయి– ధర్పల్లి మార్గంలో మొదలుకాని వంతెనల పునర్నిర్మాణం
- పట్టించుకోని అధికారులు



వెంగల్‌పాడ్ వద్ద ఉన్న లో లెవల్ వంతెన

ఇందల్వాయి: ఇందల్వాయి నుంచి ధర్పల్లికి వెళ్లే రోడ్డు మార్గంలో వెంగల్‌పాడ్, లింగాపూర్ గ్రామాల వద్ద వాగులపై లో–లెవెల్ వంతెనలు ఉన్నాయి. ఈ వంతెలను హై లెవెల్ వంతెనలుగా మార్చేందుకు ప్రభుత్వం ఇటీవల నిధులు మంజూరు చేసింది. కానీ నెలలు గడుస్తున్నా పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తి కావాల్సి ఉన్నా, అ దిశగా అడుగులు ముందుకు పడటం లేదు. దీంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

వేరే చోట్ల ప్రారంభమైన పనులు..

వెంగల్‌పాడ్ వంతెనకు రూ. 5కోట్లు, లింగాపూర్ వంతెనకు రూ.7కోట్ల నిధులు మంజూరయ్యాయి. నిధులు మంజూరు కాగానే ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేశారు. కానీ పనుల్లో జాప్యంతో నిరుత్సాహానికి గురవుతున్నారు. ధర్పల్లి మండలం వాడి వంతెన, సిరికొండ మండలం గడ్కోల్ వంతెన నిర్మాణలకు నిధులు మంజూరు కాగా, పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. కానీ ఇక్కడ మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. వెంగల్‌పాడ్ వంతెన పనులు ప్రారంభమైనా పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు వద్దె పనులు నిలిచిపోయాయి. లింగాపూర్ వంతెన పనులు ఎన్నికల కోడ్‌కి ముందు ప్రారంభమవ్వలేదు. కాబట్టి కోడ్ ముగిసే వరకు పనులు ప్రారంభించే అవకాశం లేదని సంబంధిత అధికారులు తెలిపారు. అధికారుల అభిప్రాయం ప్రకారం లింగాపూర్ వంతెన నిర్మాణం మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికైనా ఆధికారులు స్పందించి లింగాపూర్, వెంగల్‌పాడ్ వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి, త్వరగా పూర్తిచేయించాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ఆలస్యమైతే ఇబ్బందులు..



ఇందల్వాయి–ధర్పల్లి రోడ్డు మార్గంలో లో-లెవెల్ వంతెనలు ప్రమాదకరంగా మారాయి. వాటిని హై-లెవెల్ వంతెనలుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా, పనులు కొనసాగడం లేదు. పనులు ఆలస్యం అయితే వర్షాకాలంలో మళ్లీ ఇబ్బందులు తప్పవు. ఇప్పటినైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పనులు సకాలంలో పూర్తిచేయించాలి.

– నోముల శ్రీనివాస్ రెడ్డి, నల్లవెల్లి

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,200	వెండి (కిలో)	83,500
22 క్యారెట్స్	66,600	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	30	50
బెండకాయ	20	40	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	30	50	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
బీర్నీసుకాయ	30	60	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	15	30	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	30	50
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	80
క్యాప్సికం	50	80	– సుభాష్‌నగర్		

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్సెడ్	200
	(కిలోకు)	లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 10.25, 1.30, 4.35, 7.40, 10.45
స్క్రీన్-2	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.45, 1.40, 4.40, 10.30, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు) 7.45
స్క్రీన్-3	భరత నాట్యం (తెలుగు) - 1.40, టిల్లు స్క్వేర్ (తెలుగు) - 7.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 11.45, 3.10, 6.35, 10.00
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 11.20, 2.00, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-ఇంగ్లీష్) - 4.40, 7.20, 10.00
స్క్రీన్-3	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.30, 1.30, 7.40, 10.40, భరత నాట్యం (తెలుగు) - 4.55
స్క్రీన్ -4	క్రూ (తెలుగు) - 10.30, 1.20, 7.35, ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు) - 4.10, భరత నాట్యం (తెలుగు) - 10.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	భరత నాట్యం (తెలుగు)
లలితామహల్	ది ఫ్యామిలీ స్టార్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)

సంక్షిప్తం

ఏఐఎస్ఏలో చేరిక



నిజామాబాద్అర్బన్: వివిధ జిల్లాలకు చెందిన ఏఐపీఎస్‌యూ విద్యార్థి సంఘాల నాయకులు ఆదివారం నగరంలో జరిగిన సమావేశంలో ఏఐఎస్ఏ(అఖిల బారత విద్యార్థి సంఘం)లో చేరారు. అనంతరం ఏఐఎస్ఏ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా జ్వాల, అధ్యక్షు రాలిగా మేఘన, ఉపాధ్యక్షురాలిగా అపూర్వ, సహాయ కార్యదర్శిగా హర్షిత, కోశాధికారిగా తనుశ్రీ ఎన్నికయ్యారు. శెట్టిమూర్తి, కిరణ్, అంజలి, రేవతి, మౌనిక, నరేష్, సురేష్ ఉన్నారు.

సమ్మేళనానికి తరలిన బంజారాలు



సిరికొండ: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బంజారా ఆత్మీయ సమ్మేళనానికి మండలానికి చెందిన బంజారా నాయకులు ప్రత్యేక వాహనాలో తరలి వెళ్లారు. బన్నాజీ, అంబర్‌సింగ్, సంతోష్‌నాయక్ ఉన్నారు.

టీఏ, డీఏ చెల్లించాలి



నిజామాబాద్‌నాగారం: పదో తరగతి స్పాట్ వ్యాల్యూయేషన్‌లో విధులు నిర్వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులకు టీఏ, డీఏ చెల్లించాలని జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వారు ఆదివారం డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సంఘ ప్రతినిధులు శ్యామ్, రాజేష్, భూపతి, ప్రేమ్‌కుమార్, గంగాధర్, సురేష్, రామ్, ప్రవీణ్, నికిత, నవ్య, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథాను అరికట్టండి..



నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఎల్లమ్మగుట్ట చౌరస్తాలో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ ఏర్పడి నెల రోజులు కావస్తున్నా.. అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. నీరు వృథాగా పోతుండటంతో పర్యవరణవేత్త సుధీర్‌సింగ్ పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కారించాలని కోరుతున్నారు.